

## ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధ్యం



సిద్దిపేట సంగారెడ్డి మెదక్

గురువారం 19-2-2026 | పేజీలు : 10

2లో



## ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేసి, స్పష్టమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుండి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ప్రి--ఎస్.ఐ.ఆర్ పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

## వెంకటయ్యను అభినందించిన మంత్రి దామోదర రాజనర్సింహా

జహీరాబాద్, ఫిబ్రవరి 18( ప్రజా జ్యోతి న్యూస్ )జహీరాబాద్ పద్మశాలి భవన్ లో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా శ్రీ మాణిక్ ప్రభు స్కూల్ ప్రిన్సిపాల్ మరెల్లి వెంకటయ్యను అభినందిస్తూ సన్మానించారు. అంగవైకల్యం కల్గివుండి కూడా తాను జీవించడమే కాకుండా మరో పాతిక మందికి జీవనోపాధి కల్పిస్తున్న విషయం తెలుసుకొని వెంకటయ్య ను అభినందించారు. 1984 లో పాఠశాలను స్థాపించి నాలుగు దశాబ్దాలకు పైగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం, ఎక్కువ శాతం విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉన్న విషయాన్ని వివరించడంతో మంత్రి అభినందించారు. పాఠశాలను మరింత ప్రగతిపథంలో నడిపిస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు.





## పేటకాంగ్రెస్ విజయం వెనుక త్యాగధనులు

రెబల్గా పార్టీకి అన్యాయం కన్నా గెలుపు కోసం త్యాగం,,,,

అధినాయకుని గౌరవించి మాటకు విలువ ఇచ్చారు,,,,,,

ఐక్యమత్యానికి వారీ సహకారం,,,,,,

ఒక్కొక్క గడ్డిపరక ఏనుగుని బంధించినట్టు,,,,,,

విజయానికి వీ రు కూడా భాగస్తులే,,,,

జిల్లాలో రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకున్నట్టు కాకుండా విజయం చాలాచోట్ల దోబూచులాడింది. అధికారం ఉన్న నాయకులు ఉన్న ప్రజల్లో సంశయమైన దోబూచులాట కాంగ్రెస్ ఓటమికి చాలాచోట్ల ఆటంకాలు ఏర్పడ్డాయి మెదక్ జిల్లాలో కూడా బి ఆర్ఎస్ బిజెపి పార్టీలు మెదక్ జిల్లాలోని కాక రాష్ట్రంలో తీవ్రమైన పోటీని బలమైన అభ్యర్థులను మాజీ అధికార పార్టీ అయితే డబ్బులను పెద్ద ఎత్తు న పెట్టి కాంగ్రెస్కు పెద్ద సవాలే విసిరింది రామాయంపేట మున్సిపల్ కు వస్తే అధికారం ఉన్న ఎమ్మెల్యే పదవి ఉన్నా స్థానిక ఎన్నికల్లో గతం నుండి పది సంవత్సరాలుగా అన్ని స్థానిక సంస్థల పదవులను ఏకపక్షంగా సాధించి కాంగ్రెస్ ను పంజరంలో వేసిన ఘనత విఆర్ఎస్ పార్టీ దే గతంలో అనైక్యత పార్టీలో నుండి కోవట్లు టిఆర్ఎస్కు పెద్ద మొత్తంలో ఉండడమే కాకుండా అధినాయకత్వం కూడా లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే ఇక్కడ ఉన్న నాయకులు పోతే పోనీ నాకేంటి మాకు మాత్రం నాయకత్వానికి లోటు లేదు అనే ధోరణిలో గడిచింది కాబట్టి టిఆర్ఎస్ కు పోటీ లేకుండా సాధించాలన్నది పరిశీలిస్తున్న భావన కానీ మైనంపల్లి మంత్రాంగం అందర్నీ ఏకతాటిపై తీసుకువచ్చి నయాన భయాన ఓకే అభ్యర్థికి విజయానికి సహకరించాలని ఆదేశాలు చాలా బాగా పనిచేశాయి.

## జహీరాబాద్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

2లో



జహీరాబాద్, ఫిబ్రవరి 18( ప్రజా జ్యోతి న్యూస్ ) కాంగ్రెస్ తోనే పట్టణాభి వృద్ధి సాధ్యమని నమ్మి, మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కట్టబెట్టిన జహీరాబాద్ పట్టణ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జహీరాబాద్ ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రజా స్వామ్యానికి నిదర్శనమని, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం ప్రజలు కాంగ్రెస్‌పై ఉంచిన నమ్మకానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు పార్లమెంట్ ఇంచార్జిగా మంత్రివర్యులు అజారుద్దీన్, కో–ఆర్డినేటర్‌గా టీయంఆర్ ఇఐఎస్ చైర్మన్ మహమ్మద్ ఫహీమ్ ఖురేషి, పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ శెట్కార్ మార్గ దర్శకత్వంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగడం వల్లే మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోగలిగామని పార్టీ ఇంచార్జి చంద్ర శేఖర్, మాజీ టిజిఐడిసి చైర్మన్ మహ్మద్. తన్వీర్, సిడిసి చైర్మన్, ఆత్మ కమిటి చైర్మన్ కి మరియు పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకు లకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు జహీరాబాద్ పట్టణ ప్రజల తరపున,పార్టీ కార్యకర్తల తరపున వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, పట్టణంలో మౌలిక సదుపాయాల విస్తరణ, సమగ్ర అభివృద్ధి, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లు సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అందు బాటులో ఉంటూ విశ్వసనీయమైన పాలనను అందిస్తామని, జహీరాబాద్ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు హామీ ఇచ్చారు.

# ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి

సంగారెడ్డి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి) పోలింగ్ కేంద్రం వారీగా పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనితీరులో వెనుకబడి ఉన్న ఆయా ఏఈఆర్ఓ లను కారణాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో ఇప్పటివరకు 51.96 శాతం మాత్రమే ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని,ప్రత్యేకంగా అర్బన్ సెగ్మెంట్‌లో పురోగతి తక్కువగా ఉన్నందున డోర్ టు డోర్ సందర్శనల ద్వారా ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేసి, పది రోజుల్లో కనీసం 85 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు.ఈ విషయంలో ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ పురోగతి ఉన్న బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఏఈఆర్ఓలు వారం రోజుల పాటు ప్రతిరోజూ మూడు ప్రాంతాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి,రోజువారీ సమీక్ష చేయాలని స్పష్టం చేశారు.పనితీరు సంతృప్తికరంగా లేని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్తగా విలీనం అయిన ప్రాంతాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ సైన్స్ టాలెంట్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

**-మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్‌లో ఉన్నత పాఠశాల డబుల్ విక్టరీ**

**-మొదటి బహుమతి సదాల లిఖిత,రెండవ బహుమతి నాలాచెరువు సాయి సన్నిహిత్ గౌడ్**



వెల్దుర్తి ప్రజాజ్యోతి ఫిబ్రవరి 18 బుధవారం నిర్వహించిన వెల్దుర్తి మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి విద్యార్థులు ప్రతిభా పతాకం ఎగురవేశారు. తొమ్మిదవ తరగతి విద్యార్థిని సదాల లిఖిత మండల స్థాయిలో మొదటి బహుమతి సాధించగా,ఎనిమిదవ తరగతి విద్యార్థి నాలాచెరువు సాయి సన్నిహిత్ గౌడ్ రెండవ బహుమతి అందుకుని ప్రతిభ చాటాడు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ కృషి, కట్టుదిట్టమైన శిక్షణ, గురువుల ప్రోత్సాహం కలిసివస్తే విజయాలు సాధ్యం అన్న దానికి వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచారన్నారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు వెంకటస్వామి, చార్లెస్, అమూల్య ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య మరియు ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



## విద్యా వికాసానికి బాటలు వేస్తున్న పీఎం శ్రీ పథకం

## వెల్దుర్తి ఉన్నత పాఠశాలకి కొత్త రంగులు

వెల్దుర్తి ప్రజాజ్యోతి ఫిబ్రవరి 18 కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. విద్యా నాణ్యత పెంపుతో పాటు పాఠశాలలను ఆధునీకరించడం లక్ష్యంగా కేంద్రం ప్రత్యేక నిధులు విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ నిధుల ద్వారా భవనాలకు కొత్త రంగులు వేయించే పనులు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ, విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేలా ఈ కార్యక్రమం చేపట్టారని,కొత్త వర్ణాలతో పాఠశాల భవనాలు ముస్తాబవుతుండటంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. శుభ్రమైన, అందమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కలగడం వల్ల విద్యార్థులకు విద్యపై మరింత ఆసక్తి పెరుగుతుందని,ఈ పథకం ద్వారా ఎంపికైన జడ్పీ హైస్కూళ్లకు కొత్త రూపం ఇస్తూ, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారన్నారు.

## మానవ సేవతోనే జన్మకు స్వార్థ కథ

## పేదరిక నిర్మూలన విద్య అభివృద్ధి

## నా సంకల్పం డాక్టర్ వైద్యనాథ్

నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి ) సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ మనూర్ మండల్ లోని తొర్నల్ గ్రామం లో కీర్తిశేషులు మాజీ సర్పంచ్ జెట్యయ్య చిత్రపటానికి వ్యవసాయ అధికారుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ బుధవారం పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ. మానవ సేవతోనే జన్మకు స్వార్థ కథ అవుతుందని, పేదరిక నిర్మూలన కోసం తన వంతు కృషి చేస్తానని, విద్య అభివృద్ధి నా సంకల్పం అన్నారు. అనంతరంకుటుంబసభ్యులు దేవునూర్ మాణిక్ కు పరామర్శించారు. కొంత ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో అంబోజి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పేటకాంగ్రెస్ విజయం వెనుక త్యాగధనులు

ప్రజా జ్యోతి రామాయంపేట ఫిబ్రవరి 18,,,, యువజన కార్యకర్తలు సాకేత్ రెడ్డి పుట్టి నికుల్ తమ కు టికెట్టు ఇచ్చే అవకాశం ఉన్న కేటాయించకపోవడం పట్ల ఏమాత్రం కూడా స్వార్థంతో ఆలోచించ కుండా నిస్వార్థంగా అభ్యర్థుల గెలవడానికి కారణమయ్యారు..పార్టీ ఐక్యమత్యంతో పాటు కోవట్లను కూడా జాగ్రత్తగా గమనిస్తూ వారికి ఎన్నికలు దూరంగా ఉంచడం మరొక ఆలోచన ఇకపోతే అధినాయకత్వానికి గెలిచే సస్తావున్న అభ్యర్థులు కూడా పార్టీ ధ్రువీకరించిన అభ్యర్థులకు పూర్తి సహకారం అందించడమే కాక ముందుండి ఓట్లను సంపాదించడం మరొకటి విజయానికి సాధ్యమైంది రెబ్బలు ఒకటి రెండు చోట్ల ఇతర పార్టీల అనుమతితో నిలబడ్డ వారిని పూర్తిగా ఓడించే ప్రయత్నం పూర్తిగా సఫలమైంది 12వ వార్డులో గతంలో షరాబు శ్యామ్ కుమార్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో బలంగా ఆర్థికంగా గెలిచి సత్తా ఉన్న గతంలో తనతో ఓడిపోయిన పోచమ్మల గణేష్ కు ఛాయిస్ ఇవ్వడం ప్రచారంలో ఉండి కాంగ్రెస్కు బలంగా ఓట్లు తేవడం నిజంగా అతను త్యాగానికి పార్టీ ప్రతిఫలం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒకటో వార్డులో గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కొన్ని సీట్లలో టిఆర్ఎస్ గాలిని అడ్డుకొని గెలిచి నిలిచిన బుర్ర అనిల్ కుమార్ చైర్మన్ కాండిడేట్ నాగరాజు లావణ్య కు పెద్ద విజయాన్ని సాధించి పెట్టాడు పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నుకోబడ్డ చింతల స్వామి 11 లో అతనికి అవకాశం ఉన్న కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థికి పూర్తి న్యాయం చేయడం ఏడో వార్డులో గొలుపర్తి 700 ఓట్లు గ్రామంలోని ఉండడం గత కొన్ని సంవత్సరాలుగా పచ్చంటి రాము పోటీ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చేదైన చైర్మన్ భర్త నాగరాజుకు త్యాగం చేసి పార్టీకి లాభం చేకూర్చాడు .అందుకే రామాయంపేట మెదక్ జిల్లాలో వేస్తున్న పోటాపోటీ బిఆర్ఎస్ గారికి ఐకమత్యములు మరియు త్యాగాలతో విజయం చేకూర్చడంలో భాగస్వాములు అయ్యారని చెప్పవచ్చు.

# ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధ్యం

## పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచన

కౌడిపల్లి ప్రజా జ్యోతి ఫిబ్రవరి 18 పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం కౌడిపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.

ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈసారి పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.మధ్యాహ్న భోజనంలో నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, పోషకాహారంతో కూడిన ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించేదుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మంత్రి దామోదర రాజనర్సింహాను సన్మానించిన పద్మశాలి సంఘం

జహీరాబాద్, ఫిబ్రవరి 18( ప్రజా జ్యోతి న్యూస్ )జహీరాబాద్ పద్మశాలి భవన్ లో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను స్థానిక పద్మశాలి సంఘం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ తో పాటు కార్యవర్గం దుశ్శాలువాలు, బొకేలతో సన్మానించారు. మంత్రి దామోదర రాజ నర్సింహ తన వద్ద పి ఏ గా పనిచేస్తున్న శ్రీధర్ కుమార్తె డోలారోహణ కార్యక్రమానికి హాజరైన మంత్రిని స్థానిక అధికార యంత్రాంగం కలిసింది. ఈ కార్యక్రమంలో లక్కీ మధు, ఎన్నం రఘు, శివరాం రమేశ్, ఇంజమూరి మల్లేశం, గద్దె వెంకటేశం, దోమల పండరి, సగ్గం శ్రీనివాస్, గుజ్జరిరాందాస్, గాజుల రామలింగం, జెట్ల శివకుమార్, బిజ్జ నిజానంద్, మరెల్లి వెంకటయ్య, నామాల సునీలు, నీలి రాజేశ్ పాల్గొన్నారు.

## పిఏ కూతురు నామకరణోత్సవానికి మంత్రి



**అందోలు, ఫిబ్రవరి18, (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యక్తిగత సహాయకులు శ్రీధర్-నాగలక్ష్మి దంపతుల కుమార్తె నామకరణ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జహీరాబాద్‌లోని పద్మశాలి భవనంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, శ్రీధర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పాపను (తన్విక) ను ఎత్తుకుని లాలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడిపిన మంత్రి, వారితో ఫొటోలు దిగారు.

# గ్రామ పంచాయితీల్లో అభివృద్ధి పరుగులు పెట్టాలి

**-అందోలు మండలంలో గ్రామాల పురోగతికై వార్డు మెంబర్ల కు 5 రోజుల శిక్షణ**

**-2వ రోజు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, పంచాయతీ రాజ్ చట్టం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై తర్ఫీదు**



**అందోలు, ఫిబ్రవరి18, (ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు మెరుగైన నిర్ణయాలు తీసుకుంటూ సరైన ప్రణాళికతో గ్రామాలను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించాలనే సంకల్పంతో పంచాయతీరాజ్ వ్యవస్థ పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సర్పంచులకు శిక్షణ ఇవ్వగా.. ప్రస్తుతం మండల కేంద్రాల్లో వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. అందులో భాగంగానే మండల పరిధిలోని 13 గ్రామాల వార్డు మెంబర్లకు నిర్వహిస్తున్న శిక్షణ లో భాగంగా బుధవారం జరిగిన రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో వివిధ అంశాలపై వార్డు మెంబర్లకు తర్ఫీదు ఇచ్చారు. మండల ప్రజా పరిషత్ అందోలు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రెండోవ రోజు ప్రధానంగా పంచాయతీ రాజ్ చట్టం, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాటి అమలు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వినీత్, సిద్దమ్మ, మల్లేశం, సుమన్ లు శిక్షకులు గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శిక్షణకి హాజరైన వార్డ్ సభ్యులకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ఇందిరమ్మ మోడల్ హౌస్ ని ప్రత్యక్షంగా చూపిస్తూ.. 5 లక్షల్లో ఇందిరమ్మ ఇంటిని ఏ విధంగా నిర్మించడం జరిగిందో హౌసింగ్ ఏఈ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, శిక్షకులు వినీత్ కుమార్, మల్లేశం, సిద్దమ్మ, సుమన్ లు వివిధ గ్రామాల వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# మాల్కాపూర్ లో కూరగాయల మార్కెట్ ప్రారంభం

## టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

**కొండాపూర్** ప్రజా జ్యోతి మండలంలోని మాల్కాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ను బుధవారం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ప్రత్యేకంగా ప్రతి బుధవారం కూరగాయల మార్కెట్ నిర్వహించేలా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కూరగాయల మార్కెట్లో లో తిరుగుతూ పలువురు కూరగాయల విక్రయించే మహిళలతో ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యార్థం కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాల్కాపూర్ గ్రామంలో మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా నాలుగు భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రెండు భవనాలు పూర్తయ్యాయని, మరో రెండు త్వరలో సిద్ధమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, త్వరలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని అన్నారు.

గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో కూరగాయల మార్కెట్ ప్రారంభంతో స్థానిక రైతులకు తమ పంటలను నేరుగా విక్రయించే అవకాశం లభించడంతో పాటు, గ్రామస్తులకు స్వచ్ఛమైన కూరగాయలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయించుకోవడం వల్ల ఆర్థిక లాభం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మాల్కాపూర్ గ్రామ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రవీణ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అలవేని నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ గొల్లపల్లి సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా మహోత్సవంలో సంగారెడ్డి జిల్లాకు 6 పతకాలు

## విజేత క్రీడాకారులకు అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**కొండాపూర్** ప్రజా జ్యోతి 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా పోలీస్ సిబ్బంది విశిష్ట ప్రతిభ కనబరిచి మొత్తం 5 పతకాలను సాధించారు. మూడవ రోజు ముగిసే సరికి సంగారెడ్డి జిల్లా పోలీస్ జట్టు 5 పతకాలను కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన క్రీడాకారులు వివరాలు 1. సంతోష్ కుమార్ సిల్వర్ మెడల్, 2. ఎల్. చంద్ర శేఖర్, ఎఆర్ పిసి సిల్వర్ మెడల్, 3. డి. మధు, ఎఆర్ పిసి సిల్వర్ మెడల్, 4. దేవి సింగ్, ఎఆర్ పిసి కాంస్య పతకం, 5. ఎల్. రవీందర్, ఎఆర్ పిసి కాంస్య పతకం, 6. కె. శ్రావ్య, ఎఆర్ పిసి కాంస్య పతకం. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, విజేత క్రీడాకారులను అభినందిస్తూ క్రీడా పోటీల్లో విజయం సాధించడం ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ క్రీడా విభాగాలలో పోటీ పడి తమ ప్రతిభను చాటిన క్రీడాకారులు సంగారెడ్డి జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చారని, జిల్లా పోలీస్ శాఖ తరఫున విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## వరిపై కోతుల దండయాత్ర: రైతన్నల బెంబేలు

నర్సాపూర్ ఫిబ్రవరి 18 (ప్రజజ్యోతి) నర్సాపూర్ సమీపంలోని వరి పొలాలపై కోతుల దండు విరుచుకుపడుతోంది. ఏపుగా పెరుగుతున్న వరి పంటను కోతులు నాశనం చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పదుల సంఖ్యలో గుంపులుగా వస్తున్న కోతులు పొలాల్లో దూరి మొక్కలను పీకేస్తూ, తొక్కుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. చేతికొచ్చే పంటను కోతుల నుంచి కాపాడుకోవడానికి రైతులు కంటిమీద కునుకులేకుండా పొలాల వద్దే కావలి కాస్తున్నారు. రైతులు పొలాల్లో ఉండి ఎంతగా అదలిస్తున్నా, కోతులు మరోవైపు నుంచి వచ్చి పంటను చిందరవందర చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కోతుల గుంపులు పొలాల వద్దే తిష్ఠ వేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతుల పాలు అవుతుండటంతో పెట్టుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కోతులను అడవుల్లో విడిచిపెట్టాలని, తమ పంటలను రక్షించేలా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ రైతాంగం డిమాండ్ చేస్తోంది.

## 10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించాలి

## -ఎన్.శంకర్.మండల విద్యాధికారి,

**సదాశివపేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందికందిలో ఈరోజు స్నాక్స్ అందించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.ఫిబ్రవరి 16 నుండి మార్చి 10 వరకు మొత్తం 19 రోజులపాటు అందించడం జరుగుతుందని తెలిపారు, అందువల్ల మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థుల హాజరు నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులకు పోషకాహార ప్రమాణాలు పాటిస్తూ స్నాక్స్ అందించాలి, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు, మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్.ఎంలు పై ఆదేశాలను అమలు పరచవలసిందిగా తెలుపడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్.ఎం వినయకుమార్, టీచర్స్, సిఆర్పి రాజేశ్వర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.



# కులం పేరుతో మహిళను దూషించిన ఘటనలో నిందితుల రిమాండ్

## మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్



మెదక్ (ప్రజాజ్యోతి ) పిబ్రవరి 18: మెదక్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజకీయ మద్దతు విషయంలో ఏర్పడిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కులం పేరుతో మహిళను దూషించడమే కాకుండా, ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చెసిన ఘటనకు సంబంధించి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ తెలిపారు.

మెదక్ డియస్పి డి. ప్రసన్నకుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్త మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి భర్త మల్లికార్జున్ గౌడ్ మరియు అతని అనుచరులు ఆమెను బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే ఆమె ఇందుకు నిరాకరించడంతో, 09 వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో మల్లిఖర్జున్ గౌడ్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ బూతు మాటలు మాట్లాడినట్లు ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

ఈ ఘటన విషయమై బాధితురాలు స్థానిక ఎమ్మెల్యేకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు బయలుదేరిన సమయంలో, పిట్లం బేస్ చెరువు కట్ట వద్ద బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు మల్లిఖర్జున్ గౌడ్, జీవన్ రావు, వేణు, హబీబ్, మల్లేష్ తదితరులు కలిపి మొత్తం 23 మంది కలిసి ఎమ్మెల్యే వాహనంపై రాళ్లతో దాడి చేసి చంపాలనే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో వాహనానికి నష్టం వాటిల్లడంతో పాటు ఎమ్మెల్యే కు మరియు ఆయన అనుచరులకు గాయాలు అయినట్లు పేర్కొన్నారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళపై మల్లికార్జున్ గౌడ్ ఛాతిపై చేయి వేసి తోసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాల అఖిలను కులం పేరుతో దూషించిన ఘటనపై సంబంధిత సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డియస్పి తెలిపారు. ఈ కేసులో కొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

# ఎంపీడీవో కొండా లక్ష్మికి వినతి పత్రం



సదాశివపేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి: కూలీల నోటికాడి ముద్దను లాక్కునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలి. వి బి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సదాశివపేట మండల కమిటీ డిమాండ్. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సదాశివపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీని బాధ పద్ధతిలో కొనసాగించాలని వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని ఎంపీడీవో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సిములు మాట్లాడుతూ. రేక్కాడితే గాని డొక్కాడనటువంటి పేదలు ప్రతి గ్రామంలో ఉన్నారనీ.వి బి జి రాంజీ చట్టంను రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కొనసాగించాలని అన్నారు. ఈ చట్టం ద్వారా కల్పించే పనుల ఆధారంగా పేదలు జీవనం కొనసాగిస్తున్నారని. కూలీలకు పనిముట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పనిముట్లను ఇప్పించాలని అన్నారు.పని ప్రదేశంలో మంచినీళ్ళు, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని 15 రోజులలోపు చేసిన పనికి కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం. మల్లేశం, టి.ఏశోబు ప్రజాజ్యోతి తో మాట్లాడుతూ ప్రతి వారం పేస్లిప్పులు ఇవ్వకుండా పేపర్ బిల్లులు రావడం లేదు అందుకే ఇవ్వడం లేదని సంబంధిత అధికారులు చెప్పడం ప్రభుత్వాలకు సిగ్గుచేటని అన్నారు. రోజు కూలీ ఎంతొస్తుందో తెలవకపోవడం ఇబ్బందికరంగా ఉందని ప్రతివారం పే స్లిప్పులు ఇవ్వాలని అన్నారు. సంబంధిత అధికారులు నిరంతరం పని ప్రదేశాలనుసందర్శించాలి.కూలీల బాగోగులు తెలుసుకొని వారిని ఆదుకోవాలని పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 800 కు పెంచేలా చొరవ చూపాలని. సంవత్సరంలో 200 రోజుల పని దినాలను కల్పించి పనులు అడిగిన వెంటనే కల్పించి వలసలను నివారించాలని అన్నారు. పని ప్రదేశంలో దెబ్బలు తగిలి గాయాలయితే ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందించాలని గాయాలు మానేంతవరకు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వి బి జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కొనసాగించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవి, మొగులయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం..

నర్సాపూర్ ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి) పట్టణంలోని డంపింగ్ యార్డులో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం భారీగా అగ్నికి ఆహుతయ్యాయి. దీనివల్ల వెలువడిన దట్టమైన పొగ చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పారిశ్రామిక వ్యర్థాలను కూడా ఇక్కడకు తీసుకువచ్చి రహస్యంగా తగలబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మంటలు ప్రమాదవశాత్తు అంటుకున్నాయా లేదా చెత్త భారాన్ని తగ్గించడానికి ఎవరైనా కావాలనే పెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని, వ్యర్థాలను తగులబెట్టకుండా చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.





# డిజిటల్ బోధనతో ప్రాథమిక విద్యకు నూతన దిశ

## -ఎన్.శంకర్,మండల విద్యాధికారి,

సదాశివపేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి: బుధవారం రోజున సదాశివపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలలు నాగ్సాన్ పల్లి మరియు నందికంది లను సందర్శించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ప్రాథమిక పాఠశాల నాగ్సాన్ పల్లిలో గ్రామ సర్పంచ్ కె.రవికుమార్ చొరవ తీసుకొని పాఠశాలకు రంగులు వేయించడం జరిగిందని, వారికి కృతజ్ఞతలు తెలుపుతూ,అభినందించడం జరిగిందని అన్నారు.నందికంది ప్రాథమిక పాఠశాలలో 5వతరగతి తెలుగు పాఠం డిజిటల్ కంటెంట్ ద్వారా నారాయణ చక్కగా వివరించారని తెలిపారు, ఇదే విధంగా మన మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో డిజిటల్ కంటెంట్ వినియోగాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని,వీడియో పాఠాలు,యానిమేషన్లు, ఆడియో కథలు వంటి డిజిటల్ వనరులను బోధనలో అనుసంధానం చేసి, విద్యార్థుల్లో ఆసక్తి మరియు భావనాత్మక అవగాహన పెంపొందే విధంగా టీచర్లు కృషి చేయాలని కోరారు. పాఠశాలల్లో ఉన్న డిజిటల్ పరికరాలను పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్.ఎం-వినయకుమార్, ప్రాథమిక పాఠశాలల హెచ్.ఎంలు బస్వయ్య, రామ్ రెడ్డి, టీచర్స్,సిఆర్పిలు రాజేశ్వర్,ఝాన్సీరాణి మరియు విద్యార్థులు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

# 6 వ వార్డు నూతన కౌన్సిలర్ నాగుల మణెమ్మ కి ఘన సన్మానం



సదాశివపేట ఫిబ్రవరి18 ప్రజాజ్యోతి: మునిసిపాలిటీ 6 వ వార్డు బి ఆర్ ఎస్ కౌన్సిలర్ విజయం సందర్భశీగా బుధవారంకాశెట్టి టౌన్‌షిప్ వాసులు కౌన్సిలర్ మణెమ్మ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగ మణెమ్మ మాట్లాలాడుతూ వార్డు ప్రజల సహాయ సహకారాలతో విజయం సాధించానని వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు.నా హయం లో వార్డు అభివృద్ధికి నా సాయ శక్తిలా కృషి చేస్తాను అని అన్నారు.నా విజయంలో కాశెట్టి టౌన్‌షిప్ వాసుల క్రుషి అభినఫనీయమని అన్నారు .ఈ సన్మానం నా కర్తవ్యాన్ని ఎల్లప్పుడు గుర్తు చెస్తుందని సదా టౌన్‌షిప్ దేవలప్ కోసం క్రుషి చేస్తాను అని అన్నారు.ఈ కార్యక్రమములో కసెట్టి టౌన్షిప్ పెద్దలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేయడం అందరి బాధ్యత

## జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ (ప్రజాజ్యోతి) ఫిబ్రవరి18: జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోజస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళాశిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో 'బాల్య వివాహము భారత్ 1- 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం'లో భాగంగా బుధవారం జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తో కలిసి ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వాహనంలోని మైక్ సదుపాయంతో గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ బాల్యవివా హాలపై అవగా హన కల్పిస్తామన్నా రు. బాల్యం ఎంతో విలువైన దశ అని, బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, రక్షణ హక్కులు కల్పించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాల వివరాలు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేయడంలో అందరూ బాధ్యత వహించాలని చెప్పారు.జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామసభలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన తండాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శాఖ అధికారినీ హేమ భార్గవి, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు,జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు, మహిళా శక్తి కేంద్ర కోఆర్డినేటర్ సంతోషి, విజన్ సంస్థ డైరెక్టర్ కైలాష్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు రాజు, శరత్ మరియు సిబ్బంది సంజీవ్, నవనీత పాల్గొన్నారు అదేవిధంగా జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్నా విద్య దానం గొప్పది గ్రామీణ విద్యార్థులకు ఆర్థిక సహాయం





## హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్

నారాయణఖేడ్ పిబ్రవరి 18( ప్రజా జ్యోతి ) అన్ని దానాల కన్నా విద్య దానం గొప్పదని, గ్రామీణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం కోసం హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందన్నారు. ట్రస్ట్ అధ్వర్యంలో బుధవారం విద్యాసామాగ్రి విద్యార్థులకు అందించారు. సంగారెడ్డి, మనూర్ మం పరిధిలో ఉన్న ఎల్గొయి, షెల్గిరా ఈ రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న 37 మంది విద్యార్థినీ, విద్యార్థులకు దాత కె. వెంకటరమణ సూపరిండెంట్ ఇంజనీర్, విద్యుత్ శాఖ సహకారంతో ఎగ్జామ్ కిట్లులను పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. రవి నాయక్ మాట్లాడుతూ దాత వెంకట రమణ సహకారంతో గతంలో ఈ రెండు పాఠశాలల్లో 10త్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పబ్లిక్ పరీక్ష ఫీజును కూడా చెల్లించారు. మారుమూల గ్రామీణ ప్రాంతం లో ఉన్నటు వంటి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, లాంగ్ స్కేల్, పెన్ను, పెన్సిల్, షాప్నర్, ఎరేజర్ లు పబ్లిక్ పరీక్ష సమయంలో ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడుతుందని భావించి కిట్లులను అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయులు రమావత్ దేవి సింగ్, ఉపాధ్యాయులు సామ్య నాయక్, క్రమాన్, సంగ్రామ్, భరత్, దేవిసింగ్, కాశీరాం, అనిత, శివలింగములు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు, వరకట్నం సామాజిక అరిష్టం




నర్సాపూర్ ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి) బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు లేని సమాజ నిర్మాణానికి విద్యార్థులు, యువత నడుం బిగించాలని న్యాయ నిపుణులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల న్యాయ సేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో స్థానిక డాన్ బాస్కో పాఠశాలలో న్యాయమూర్తి హేమలత ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సహాయ న్యాయవాది శ్రీధర్ రెడ్డి ఎంఈఓ తారా సింగ్, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూప రాణి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం చట్టరీత్యా నేరమని, దీనికి పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ఇలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించా లన్నారు. విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎండి ముజీబ్ హైమద్, స్కూల్ డైరెక్టర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపల్ మేఘన, న్యాయవాది ప్రభు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేదల సంక్షేమలు అధికార కాంగ్రెస్ పార్టీకే సాధ్యం



## అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీకి సాధ్యం. 10 లక్షలతో పారశాల ప్రవారిగూడా.

**ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.**

**సదాశివ పేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి:** గ్రామాల అభివృద్ధి పేద ప్రజల సంక్షేమం అధికార కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి బుధవారం మండలంలోని మద్దికుంట. ఏటిగడ్డ సంఘం గ్రామాలలో రెండు ఇందిరమ్మ ఇల్లు. ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షల తో పారశాల ప్రవారి గోడనిర్మాణం పనులను సర్పంచ్ దేవి సింగ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరమ్మ ఇండ్లు. గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పారశాల ప్రవారి గోడ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు అర్హులైన పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను. సద్వినియోగం చేసుకోవాలన్నరు. పేదల సొంతింటి కల ఇద్దరమ్మా ఇండ్ల పనులను వేగవంతం చేసి పేదల కోరికలు తీరుస్తామన్నారు. రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే. జెడ్పి. మండల పరిషత్ కార్యాలయం పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి. మండల పార్టీ అధ్యక్షుడు సిద్ధన్న. పిఏసిఎస్ మాజీ చైర్మన్ ఆశిర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ మాసానికి హృదయపూర్వక శుభాకాంక్షలు

**మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్**



**తూప్రాన్ ప్రజాజ్యోతి ఫిబ్రవరి 18** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లాను భక్తితో ఆరాధిస్తూ నిర్వహించే ఉపవాస దీక్షలు సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం నింపాలని ఆకాంక్షించారు. నియమ నిష్ఠలు, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనల సమ్మేళనమే రంజాన్ మాసం ప్రత్యేకత అని పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాసం పాటిస్తూ ప్రార్థనలతో ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించడం గొప్ప విషయమన్నారు. అల్లా కరుణ, రక్షణ పొందాలనే సంకల్పంతో ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు, దాన ధర్మాలు చేయడం ఈ మాసం సారాంశమని తెలిపారు. సేవా భావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీకగా ముస్లిం సోదరులు రంజాన్ పండుగను జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

## నూతన చైర్పర్సన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.




సదాశివపేట ఫిబ్రవరి18 ప్రజాజ్యోతి: సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా మునిపల్లి శ్రీమతి అంజమ్మ సత్యనారాయణ బుధవారం సమావేశ మందిరంలో కమిషనర్ శివాజీఆధ్వర్యంలో పదవి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి టీజీఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఆమె సమక్షంలో చైర్ పర్సన్ గా సంతకాలు చేసి పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడారు అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ కె సాధ్యమని. పురపాలక సంఘం పట్టణ అభివృద్ధి అందరి సహాయ సహకారాలతో ఇచ్చిన మాట కట్టుబడి అభివృద్ధి చేస్తామన్నారు. గెలుపు ఓటములు సహజమని ఓడిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు నిరుత్సాహపడక వార్డు ప్రజల తో కలిసిమెలిసి ఉండి. వార్డు అభివృద్ధికి సహకరించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జెండా ఎగరడానికి కారణమైన పట్టణప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ. నాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన 20వ వార్డు ప్రజలకు రుణపడి ఉంటానని అదేవిధంగా నన్ను చైర్మన్గా ఎన్నుకొన్న కౌన్సిల్ సభ్యులకు. పార్టీ పెద్దలు జగ్గారెడ్డి. జగ్గారెడ్డి. తదితర పెద్దలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి. మండల పార్టీ అధ్యక్షులు సిద్ధన్న. పిఏసిఎస్ మాజీ చైర్మన్ ఆసిరెడ్డి. వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు. కౌన్సిలర్లు పట్లు రోజా నాగరాజుగౌడ్. శంకర్ గౌడ్. అరుణ్ కుమార్. నర్సింలు. గౌరీ దేవి తుల్జా రామ్. తదితర కౌన్సిలర్లు. మేనేజర్ ఉమేందర్ సింగ్ వారి సిబ్బంది బంధుమిత్రులు.

# గుఱ్ఱపు మచ్చేందర్ సేవలు ఆదర్శం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

## ప్రజాసేవకు అంకితమవ్వాలి బి ఆర్ ఎస్ పార్టీ అభివృద్ధి కి కృషి చెయ్యాలి





నారాయణఖేడ్ పిబ్రవరి 18 (ప్రజా జ్యోతి) ప్రజాసేవకు అంకితమవ్వాలని, బి ఆర్ ఎస్ పార్టీ అభివృద్ధి కి కృషి చెయ్యాలని, నారాయణ ఖేడ్ ప్రాంతంలో గుఱ్ఱపు మచ్చేందర్ సేవలు ఆదర్శంగ నిలుస్తు న్నాయాని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తెలిపారు. హైదరాబాద్ పట్టణంలోని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సగృహంలో నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి జి ఎం ఆర్ టీం తరపున గెలుపొందిన నూతన సర్పంచులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు జి ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ తో పాటుగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుమల మారుతి, నూతన సర్పంచులు రానాపూర్ సర్పంచ్ ఎంబడి సంగారెడ్డి,సంగెం సర్పంచ్ ధర్మానాయక్,గౌడ్గమ్ సర్పంచ్ తనజీ పటేల్,ఎడ్ల రేగడి తండా సర్పంచ్ బలరాం నాయక్,సుకల్తీర్త్ సర్పంచ్ నీలేష్,రాసోల్ సర్పంచ్ యేసు,రేకే నాయక్ తండ సర్పంచ్ శంకర్,కిషన్ నాయక్ తండ సర్పంచ్ సంజు,దామరగిద్ద ఉప సర్పంచ్ సుభాష్, జిరిగి తండ ఉప సర్పంచ్ సురేష్, జిరిగి తండ మాజీ ఎంపీటీసీ కిరణ్, దామర్గిద్ద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్,సీతారాం తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్,మాజీ సర్పంచ్ పుండ్లిక్, రాసోల్ మాజీ సర్పంచ్ సాయిలు, సుకల్తైర్త్ మాజీ సర్పంచ్ విజయ్ పటేల్, పార్టీ సీనియర్ నాయకులు బసవరాజ్ పటేల్, బీమ్రా బస్వరాజు పటేల్,గుఱ్ఱపు జ్ఞానేశ్వర్,బోరంచ సంగారెడ్డి, మోట్లకుంట నర్సింలు,బెల్లాపూర్ బసవరాజ్ పటేల్, పటేల్,గాంధీనగర్ హనుమాన్లు, హర్షవర్ధన్ రెడ్డి, నాయకులు ప్రహ్లాద్, శ్రీకాంత్, మోహన్,సందీప్, రాజు,వాసు, సుధాకర్ ,తదితర నాయకులు,యువత పాల్గొన్నారు.



## 12వ వార్డ్ కౌన్సిలర్ పులి మామిడి మమత రాజుకు సన్మానం...

సదాశివపేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి: 12వ వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందినపులిమామిడి మమత రాజు దంపతులను బుధవారం ఆమె నివాస గృహంలో ఇశ్రీతాబాద్ గ్రామ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్ వారి వార్డు సభ్యులు శాలువా పూలదండలతో పుష్పగుచ్ఛం అందజేసిఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మాన కార్యక్రమంలో ఇశ్రీతాబాద్, ఉపసర్పంచ్ కట్టేహోస్ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు అబ్దుల్ రషీద్, సయ్యద్ ఇర్ఫాన్,బల్ రామ్ రాములు, రమేష్,చేపల సహకార సంఘం అధ్యక్షులు గారకుర్తి రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దప్పు వెంకటేష్, కట్టేగోశే సునీల్, మర్పల్లి రాజ్ కుమార్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాజీ జయంతి సందర్భంగా దానంపల్లి లో భారీ ర్యాలీ

**-వేడుక ముగింపులో మహా అన్నదానం**

**-యువకులు భారీగా తరలిరావాలని శివాజీ యూత్ పిలుపు**

**అందోలు, ఫిబ్రవరి18, (ప్రజాజ్యోతి):** శివాజీ జయంతి సందర్భంగా దానంపల్లి లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు శివాజీ యూత్ సభ్యులు పేర్కొన్నారు. అందోలు మండల పరిధిలోని దానం పల్లి గ్రామ శివారులో హైవే పక్కన గత రెండు సంవత్సరాల క్రితం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన చేసి, శివాజీ జయంతి ఉత్సవ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా నేడు గ్రామంలోని హనుమాన్ ఆలయం నుండి గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన గల శివాజీ చౌక్ వరకు భారీ ర్యాలీ ఉంటుందని, జయంతి ఉత్సవాల అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూ సామ్రాట్, జాతీయతా భావానికి మచ్చుతునక, హిందూ సమాజాన్ని ఏకతాటిపై నడిపిన గొప్ప నాయకుడు, కుల మతాలకు అతీతంగా సుపరిపాలనను అందించిన రారాజు శివాజీ జయంతి సందర్భంగా జరుగుతున్న ఉత్సవ వేడుకల్లో యువకులు, విద్యార్థులు, గ్రామస్తులు, పరిసర గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివాజీ యూత్ సభ్యులు పిలుపునిచ్చారు.




# జూకల్ గ్రామన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

## గ్రామ దశ దిశ మారుస్తా సర్పంచ్ ఎల్ అనిత



**నారాయణఖేడ్ (ప్రజా జ్యోతి) సంగారెడ్డి** జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్ గ్రామన్ని జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ శెట్కర్ , నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాలతో స్థానిక సర్పంచ్ లింగాపూర్ రజిత వినయ్ పటేల్ బుధవారం మహిళ సమైక్య భవనం రూ. 10 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లింగాపూర్ రజిత వినయ్ మాట్లాడుతూ....ఎమ్మెల్యే, ఎంపీ నిధులతోజూకల్ గ్రామన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, గ్రామన్ని దశ దిశ మారుస్తా నాని తెలిపారు. గ్రామంలోని అన్ని మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేయడానికి కృషి చేస్తానన్నారు. మహిళా సమైక్య భవనం సమీపంలో మూడు బోర్లను వేస్తామన్నారు. గ్రామంలో ఈ సమస్య ఉన్న క్రమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవుల నాయక్, వార్డు మెంబర్లు మరెల్లి లక్ష్మి, మెగావత్ ప్రవంతి, జాదవ్ కవిత,గొని రవీందర్, గ్రామ అధ్యక్షులు మైయి నెల్లి శంకర్, ఉపాధ్యక్షులు ఇందూరు మల్లప్ప, ఈవో లీడర్ సునీత, గ్రామ లీడర్లు తోట ఇరమణి, మ్యాతరి సర్వమ్మ, మూద మంజుల, గ్రామస్తులు ఈదులపల్లి విజయ్, ఉజులంపాడు మల్లప్ప, కోటిపల్ల రవి పటేల్, ఆవుటి నారాయణ, మస్కూరి ఈరన్న, కిషన్ నాయక్, శంకర్ నాయక్, గైని తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ 8వ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

**-ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ అధ్యక్షులు నిఖిల్, ఉపాధ్యక్షులు దుర్గ వరప్రసాద్**




అందోలు, ఫిబ్రవరి18, (ప్రజాజ్యోతి):ఈనెల 20వ తేదీన జహీరాబాద్ పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా 8వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ అధ్యక్షులు నిఖిల్, ఉపాధ్యక్షులు దుర్గ వరప్రసాద్ లు పిలుపునిచ్చారు. బుధవారం జోగిపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ.. విద్యారంగంలో వస్తున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) 8వ జిల్లా మహాసభ జిల్లాలోని జహీరాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా మహాసభల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ ల పెండింగ్ అంశంపై కూడా చర్చ జరుగుతుందని, ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడం తో పాటు దశల వారి ఉద్యమాలకు కార్యాచరణ ఉంటుందని, నిరంతరం విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నదని, మన ప్రాంతంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థి లోకాన్ని ఈ సందర్భంగా మీడియా ముఖంగా కోరారు.

# కొంతాన్‌పల్లి గ్రామంలో ఆడబిడ్డలకు సర్పంచ్ ప్రత్యేక ప్రోత్సాహం

## పుట్టిన ప్రతి ఆడపిల్లకు రూ.5,000 ఫిక్స్‌డ్ డిపాజిట్




శివ్వంపేట ప్రజాజ్యోతి ఫిబ్రవరి 18: గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ప్రముఖ సంఘసేవకులు,కొంతాన్‌పల్లి గ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకట్రాం రెడ్డి గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకు రూ.5,000 ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఆర్థిక సహాయం అందజేయడం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తలారి నర్సింలు -- మౌనిక దంపతులకు పుట్టిన ఆడబిడ్డకు రూ.5,000 మరియు బ్యాగరి సంతోష్ -- నందు కిషోర్ దంపతులకు పుట్టిన ఆడబిడ్డకు రూ.5,000లను సర్పంచ్ స్వంత నిధుల నుంచి అందజేశారు. ఆడపిల్లల భవిష్యత్ భద్రత, విద్యాభివృద్ధి మరియు సమాన హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్లకు ఈ సహాయం అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు సీవీర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## హుల్గెర పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం

రాయికోడ్ ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి) హోల్గెర ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా ఏడవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది. అలాగే మరికొన్ని రోజులలో పదవి విరమణ చేయబోతున్న రాయికోడ్ మండల విద్యాశాఖ అధికారి మానయ్య సార్ ని పాఠశాల తరపున సన్మానించి వారి సేవలను కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాంపాడు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సంగీత మేడం, రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ సార్, హోల్గెర పాఠశాల ప్రధానోపాధ్యాయులు అఖిలేష్ సార్, ఉపాధ్యాయుల కోటేశ్వర్ సార్, శ్రీదేవి మేడం, సౌమ్య మేడం, ఔరంగానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం సార్, తెలుగు పండిత్ రమేష్ సార్, శ్రీహరి సార్, శివాజీ సార్ పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్. అనంతసాగర్ గ్రామానికి చెందిన కిరణ్, శ్రీనివాస్ లు.

**కొండాపూర్** ప్రజా జ్యోతి బిఆర్ఎస్ పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న అనంత సాగర్ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ బాస్ కిరణ్ పార్టీ నాయకుడు బాస్ శ్రీనివాస్ లను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఎం.విఠల్ తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ అనంతసాగర్ గ్రామంలోని బిఆర్ఎస్ నాయకులపై బూతు మాటలు, పరుష పదజాలంతో మాట్లాడుతూ ఉండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడికి అనంత సార్ బి ఆర్ ఎస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో పార్టీ సస్పెండ్ చేయాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదేశించడంతో కిరణ్ శ్రీనివాస్ లను పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు విట్టల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బందోబస్తులో ఉన్న ఏఎస్ఐపై దాడి.. ఇద్దరిపై కేసు

నర్సాపూర్ ఫిబ్రవరి 18 (ప్రజాజ్యోతి) విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిపై ఇద్దరు వ్యక్తులు దాడికి తెగబడిన ఘటన నర్సాపూర్ మండలంలో కలకలం రేపింది. మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో దుర్గమ్మ జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో బందోబస్తు నిమిత్తం వెళ్లిన నర్సాపూర్ ఏఎస్ఐ మల్లేష్, ఇతర సిబ్బంది గ్రామస్తుల మధ్య జరుగుతున్న గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. గ్రామానికి చెందిన మహేందర్, రాజు గౌడ్ అనే వ్యక్తులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించి ఏఎస్ఐ చేతిలోని లాఠీని లాక్కొని, బూతు మాటలతో దుర్భాషలడుతు చొక్కా కాలర్‌ను లాగి దాడికి దిగారు. దీంతో ఏఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## నిర్మల జగ్గారెడ్డి, చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ లకు సన్మానం.

**19 వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్.**

సదాశివపేట ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి: నూతనపదవి బాధ్యతలు చేపట్టిన చైర్ పర్సన్ ముని పల్లి అంజమ్మ సత్యనారాయణ. వైస్ చైర్మన్ రేణుకా చిరు అభినందన సభ కార్యక్రమానికి విచ్చేసిన టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి నీ మరియు పదవి బాధ్యతలు చేపట్టిన చైర్ పర్సన్ మరియు వైస్ చైర్ పర్సన్ లను బుధవారం పురపాలక సంఘం సమావేశ మందిరంలో19 వాడు కౌన్సిలర్ పట్లూరు రోజా నాగరాజుగౌడ్ శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





## బీరప్ప ఆలయ నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ షాబుద్దీన్

**సదాశివపేట** ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి: మండలంలోని మిలిగిరి పేటలో కురుమ సంఘం పెద్దల ఆహ్వానం మేరకు బుధవారం బీరప్ప స్వామి దేవాలయం యొక్క భూమి పూజ లో పాల్గొనడం జరిగిందని సర్పంచ్ షాబుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి తోపాటు ప్రజలకు ఎల్లవేళలా వాటిలో ఉండి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ యాదయ్య వార్డ్ నెంబర్ నరసింహారెడ్డి మైలారం సంజీవరెడ్డి సంగారెడ్డి మల్లారెడ్డి మహమ్మద్ సంఘం పెద్దలు పీజీ విట్టల్ జి మాణిక్యం పీజీ మల్లన్న సూరయ్య సంగయ్య పెద్ద గొల్ల శీను పీజీ నారాయణ పీజీ కుమార్ పీజీ నాగన్న పాల్గొనడం జరిగింది.

## బిఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం

సంగారెడ్డి ఫిబ్రవరి 18 (ప్రజా జ్యోతి) మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన 8వ వార్డు కౌన్సిలర్ కె. సురేష్ మరియు 29వ వార్డు కౌన్సిలర్ బేగరి శ్రీకాంత్‌లకు అంబేద్కర్ యువజన సంఘం సోషల్ మీడియా ఇన్చార్జ్ బేగరి పురుషోత్తం రామచంద్ర మంద్రే, స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు మరియు ప్రాంతీయ నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన కౌన్సిలర్లు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన,అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వార్డుల అభివృద్దే తమ ప్రథమ లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.పూలమాలలు,శాలువాలతో కౌన్సిలర్లను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



## ట్రాక్టర్ టైర్ కింద పడి మహిళ మృతి

కొల్చారం(ప్రజాజ్యోతి): ఆర్టీసీ బస్సు ట్రాక్టర్ను ఓవర్టేక్‌చేసే క్రమంలో జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం కొల్చారం మండలం రంగంపేట శివారులో జరిగింది. గ్రామస్తులు, మృతురాలి భర్త సునావత్ దీప్లా కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దుంపల కుంట వైపు నుండి ఎర్రమట్టి తండాకు వస్తుండగా, రంగంపేట శివారులో ఆర్టీసీ బస్సు ట్రాక్టర్ను ఓవర్టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్ను తగలడంతో రోడ్డు పక్కనుండి వెళ్తున్న మోటార్ సైకిల్ పైకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో మోటార్ సైకిల్ పై ఉన్న సునావత్ శాంతి (48)పై నుంచి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త దీపాకు గాయాలయ్యాయి. మృతురాలి భర్త దీప్లా ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై మహమ్మద్ మొహినుద్దీన్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

